
గాజులరామారంలో ఊరేగింపును ప్రారంభిస్తున్న కూన శ్రీశైలంగౌడ్


శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరాముని ఊరేగింపులో భక్తజనం


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి

అందరి బంధువయా.. అయోధ్య రామయ్య

• దేవాలయాలు, కాలనీల్లో ఆధ్యాత్మిక శోభ • అంతా రామమయం


ఊరేగింపులో జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తున్న కూన శ్రీశైలంగౌడ్


దూలపల్లిలో పూజలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, బూర్గుబావి సత్యనారాయణ


రాముని వేషధారణలో ఉన్న చిన్నారితో బీజేపీ నేత శివాజీరాజు


గణేష్‌నగర్‌లో శ్రీరాముడి ఊరేగింపు

శ్రీరామ నామ స్మరణతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మార్మోగింది. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం నేపథ్యలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శ్రీరాముడి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్షేమ సంఘాలు, బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ల ఆధ్వర్యంలో శ్రీరాముడి ర్యాలీలు నిర్వహించారు. కాలనీలు, బస్తీల్లో సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో గాజులరామారం నుంచి షాపూర్‌నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లలో భక్తులు బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వీక్షించారు. – కుత్బుల్లాపూర్




ఇంటి ముందు దీపాలు వెలిగిస్తున్న మహిళలు


రోడ్డు పక్కన భజనలు చేస్తున్న వృద్ధులకు అన్నదానం చేస్తున్న యువకులు


చింతల్ బీపీఎస్ ఒలింపియాడ్ స్కూల్‌లో వేడుకలు


అపురూపా కాలనీ టీవీఆర్ స్కూల్‌లో సీతారాముల పట్టాభిషేకం ఘట్టం


సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో సీతారాముల వేషధారణలో చిన్నారులు


పద్మానగర్ ఫేజ్-1 గాయత్రి అపార్ట్‌మెంట్‌లో..


జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లో మహిళల ర్యాలీ


వైష్ణవి మిడోవ్స్ గేటెడ్ కమ్యూనిటీలో అన్నదానం


బాలయ్యనగర్‌లో అన్నదానం రామ భక్తులు


ఏపీహెచ్‌బీ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న కాలనీవాసులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బీవీఆర్‌ఐటీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు బీవీఆర్‌ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, సత్యం వ్యాలీ, పూజిత ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో, అదే విధంగా 11కేవీ రాజీవ్‌గాంధీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాజీవ్‌గాంధీనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

◆ **ప్రగతినగర్ ఫీడర్ పరిధిలో..**

మిథిలానగర్, లేక్‌వ్యూ కాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మిథిలానగర్, ఆర్‌కే లేఅవుట్, వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, లేక్‌వ్యూ కాలనీ ప్రాంతాల్లో, అదే విధంగా 11 కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాల, చర్చి రోడ్డు, అంబేడ్కర్ పార్క్ ఏరియా, తిరుమల ఫర్నిచర్స్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, శిల్ప లేఅవుట్, డాలర్స్ హోమ్స్, మోర్ సూపర్‌మార్కెట్, అంబాభవానీ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ కోరారు.

◆ **జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో...**

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు దేవమ్మబస్తీ, బీరప్పనగర్, పాపిరెడ్డినగర్, సంజయ్‌పురి, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జగద్గిరిగుట్ట, బీరప్పనగర్, అంజయ్యనగర్, మైసమ్మనగర్, సోమయ్యనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కవాతులో పసిడి పతకం


కవాతులో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్న వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ విద్యార్థి ధీరజ్

నిజాంపేట్: గణతంత్ర దినోత్సవ కవాతులో బాచుపల్లి వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ కవాతులో తెలుగు రాష్ట్రాలకు చెందిన 3లక్షల మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొనగా జూనియర్ నేవీ కేటగిరీలో వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్‌కు చెందిన నాగండల ధీరజ్ బంగారు పతకాన్ని సాధించాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ కోడాలి విజయరాణి ధీరజ్‌ను అభినందించారు. తోటి విద్యార్థులు ధీరజ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.

చెరువులోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్: భార్యతో గొడవపడి మనస్తాపానికి గురైన భర్త చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దుండిగల్ తాండా–1కు చెందిన మాలోత్ బాబు(39), భారతిలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబు కూలీ పనులు చేస్తుండగా భారతి తాండా కమాన్ రోడ్డు వద్ద కిరాణా దుకాణం నిర్వహిస్తుంది. కాగా గత కొంత కాలం నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 21వ తేదీన మరోసారి వీరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన బాబు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం రాత్రి 8గంటల సమయంలో చెరువులో శవమై కనిపించాడు. భార్యతో గొడవ పడి మనస్తాపానికి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వినూత్నంగా రోడ్డు భద్రత వారోత్సవాలు


యముడి వేషధారణలో అవగాహన కల్పిస్తున్న ఓ కార్మికుడు

కుత్బుల్లాపూర్: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పేట్‌బషీరాబాద్, కొంపల్లి ప్రాంతంలోని అపర్ణ శేరినిటి నుంచి అపర్ణ గ్రీన్ స్కేప్ వరకు ఆ సంస్థలో పనిచేసే కార్మికులు వినూత్న తరహాలో ర్యాలీ నిర్వహించి ఆకట్టుకున్నారు. ఓ కార్మికుడు యముడి వేషధారణలో ముందు వరుసలో నడుస్తూ అవగాహన కల్పించారు. ఆయన వెనుక 400 మంది కార్మికులు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు రంగాచారి, నరసింహమూర్తి , సుబ్బరాజు, శ్రీనివాస్, వీరస్వామి, సురేష్‌రెడ్డి, శ్రీకాంత్, శ్యామ్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. వేగంగా వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని, ఇతర వాహనాలకు సహకరిస్తూ ముందుకు సాగాలన్నారు. ఉద్యోగాలకు వెళ్లే సమయంలో 5నిమిషాల ముందే ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాలని కోరారు.

చిత్తారమ్మ జాతరలో అపశృతి


రాముగౌడ్ (ఫైల్)

సుభాష్‌నగర్: గాజులరామారం చిత్తారమ్మ జాతరలో అపశృతి చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం పోతరాజుల విన్యాసాల్లో గ్రామానికి చెందిన బట్టల రాముగౌడ్ (42) పాల్గొన్నారు. ఇంతలో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే పోలీసులు అతడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాములుగౌడ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బాలుడి అదృశ్యం


సందీప్ (ఫైల్)

జీడిమెట్ల: ఇంటి నుంచి కళాశాలకు అని చెప్పి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హరీష్ వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్‌నగర్ జనప్రియ అపార్ట్‌మెంట్‌కు చెందిన శర్మ కుమారుడు సందీప్(16) చింతల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం కళాశాలకు వెళ్తున్నానని సందీప్ ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం కళాశాల యాజమాన్యం సందీప్ తల్లి సత్యవతికి ఫోన్ చేసి సందీప్ కళాశాలకు రాలేదని తెలిపారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు సందీప్ కోసం చుట్టు పక్కల స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.ఈ విషయమై బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ విడుదల


తాపీ మేస్త్రీలకు గిఫ్ట్‌లు అందజేస్తున్న భారతి సిమెంట్స్ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మివెంకటేశ్వర ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాత్విక్‌రెడ్డి మాట్లాడుతూ... మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్ బ్రాండ్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా శ్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. శ్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు, కార్మికులకు గిఫ్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మివేంకటేశ్వర ట్రేడర్స్ డీలర్ ధర్మారెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ నరసింహులు, 50 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 8 దరఖాస్తులు


ప్రజావాణిలో ఆర్జీలు స్వీకరిస్తున్న ఉపకమిషనర్ మల్లయ్య

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని గాజులరామారం ఉపకమిషనర్ మల్లయ్య అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్(07), ఎలక్ట్రికల్(1) చొప్పున ఆర్జీలు రాగా వాటిని స్వీకరించిన ఉప కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం


గిరినగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: నిరుపేద ప్రజలు ఉండే బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ నియోజవకర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌లో కాంగ్రెస్ నాయకులు సల్మాన్, నజీరుద్దీన్, భాస్కర్, శ్రీనివాస్, రషీద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలు పాలుపంచుకోవాలన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 300 మందికి పైగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో ఏఐసీసీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఓబీసీ సెల్ సోషల్ మీడియా కోర్డినేటర్ తైలం శ్రీనివాస్, గురువారెడ్డి, బాలరాజు ముదిరాజ్, గణేష్, మహమ్మద్ అజర్, దళిత నాయకులు ఏలీయా కాకా, హరీష్ చర్య, జలీల్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు పడతాయి

భవిష్యవాణిలో చిత్తారమ్మ అమ్మవారు


అమ్మవారి భవిష్యవాణి వినిపిస్తున్న రాజేష్

సుభాష్‌నగర్: ''నన్ను నమ్ముకున్న వారికి అంతా మంచే జరుగుతుంది. ఈ ఏడాది కూడా విస్తారంగా వర్షాలు పడతాయి. పాడి పంటలు బాగా పండుతాయి..'' అంటూ గాజులరామారం చిత్తారమ్మ జాతరలో రాజేష్ భవిష్యవాణిని వినిపించారు. చిత్తారమ్మ దేవి జాతర సోమవారం కూడా అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు తరలి వచ్చి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4గంటలకు జరిగిన పోతరాజుల గావు కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. అనంతరం రాజేష్ రంగంలో భాగంగా భవిష్యవానిని వినిపించారు.


చిత్తారమ్మ జాతరకు భారీగా తరలి వచ్చిన భక్తజనం

న్యాణతతో డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి

దుండిగల్: ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పని చేస్తున్నామని కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శామీర్‌పేట్ సంధ్య అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని 22వ వార్డులో నూతనంగా నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ, సంధ్య మాట్లాడుతూ.. మిగిలిన పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. న్యాణతతో డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హనుమంత్‌రావు, ప్రెసిడెంట్ బ్రహ్మారెడ్డి, కాలనీసభ్యులు రేవంత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, రామకృష్ణ, రామారావు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

గెలిపించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా


ఎమ్మెల్యే వివేకానంద్‌కు హారతులు పడుతున్న దత్తాత్రేయనగర్ ప్రజలు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజల సహాయ, సహకారాలతోనే అపూర్వ విజయం సాధ్యమైందని.. హ్యాట్రిక్‌గా గెలిపించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. 10వ రోజు కృతజ్ఞత కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ దత్తాత్రేయనగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు వివేకానంద్‌కు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఏర్పాటు చేసిన అయోధ్య రామయ్య ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ, చిత్తారమ్మ దేవాలయంలో పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభ్యర్థిగా తనను ప్రకటించినప్పటి నుంచి తన వెన్నంటే ఉండి తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్, బీఆర్ఎస్ నేతలు సూర్యప్రభ, దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు స్వామి, వడ్ల వెంకటాచారి, రాజు, అశోక్, హుస్సేన్, యాదగిరి యాదవ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.